క్లుప్తంగా

ఎఫ్‌డీఓగా బాలరాజు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మత్స్య శాఖ అభివృద్ధి అధికారిగా బాలరాజు నియమితులయ్యారు. కర్నూలు మత్స్యశాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బ్రహ్మంగారిమఠం మండలానికి బదిలీ అయ్యారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి స్కూటరు, వలలు, పలు రకాల సామగ్రి రాయితీపై వస్తాయన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. నిషేధ సమయంలో వేటకు వెళ్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఎఫ్‌డీఓ కిరణ్ కుమార్, బాలిరెడ్డి, రెహమాన్, బాలకొండయ్య, బోలా శ్రీనివాసులు, రమణయ్య పాల్గొన్నారు.

28న ఆర్ట్స్ కాలేజీలో జాబ్ మేళా

ప్రొద్దుటూరు: ఈ నెల 28వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యాన స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(ఆర్ట్స్‌కాలేజీ)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శశికాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కడప కొప్పర్తిలోని ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, హెల్పర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ/డిప్లొమా, బీటెక్ (ఈసీఈ, ఈఈఈ) చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 28న ఉదయం 9 గంటలకు జాబ్ మేళాలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 9573321678 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సరకుల వితరణ


దుస్తులు పంపిణీ చేస్తున్న నారాయణ

కాశినాయన: మండలంలోని బాలమ్మసత్రంలోని వృద్ధులకు తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన షేర్ ది విషన్ సంస్థ అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువ చేసే బియ్యం, కందిపప్పు, దుస్తులు, రగ్గులు, ఇతర సామగ్రి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతిస్థిమితం లేని వారిని అక్కున చేర్చుకుని తల్లిదండ్రులుగా చూసుకుంటున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, సంస్థ సభ్యులు, ఆశ్రమ సిస్టర్లు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల: ఆహార ధాన్యాలు లేక అల్లాడుతున్న క్యూబా వాసులను ఆదుకొనేందుకు విరాళాలు అందించాలని సీపీయం ప్రధాన కార్యదర్శి భైరవ ప్రసాద్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భైరవ ప్రసాద్ మాట్లాడుతూ క్యూబా చక్కెర, పొగాకు ఎగుమతి చేసి జీవనం సాగిస్తుందని, అమెరికా నుండి ఆహార పదార్థాలు దిగుమతి చేసుకుంటుందన్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక క్యూబాకు ఎగుమతులు నిలిపివేయడంతో ఆహార క్షీణతతో ప్రజలు అవస్థ పడుతున్నారని అన్నారు. ప్రపంచ దేశాలు క్యూబాను ఆదుకోవాలన్నారు.

ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలి

పోరుమామిళ్ల: ఎండ వేడిమి పెరిగిన నేపథ్యంలో ప్రతి సచివాలయం పరిధిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ రమణారెడ్డి ఆదేశించారు. సచివాలయాల కార్యదర్శులతో ఆయన సామాజిక మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జనం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు.

నేడు లిడ్ క్యాప్ చైర్మన్ పర్యటన



మాట్లాడుతున్న జయచంద్ర

బద్వేలు అర్బన్: లిడ్ క్యాప్ చైర్మన్ బుధవారం బద్వేల్‌కు రానున్నట్లు మాజీ శాప్ డైరెక్టర్ డి.జయచంద్ర పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు లిడ్ క్యాప్ చైర్మన్ అర్‌అండ్‌బీ బంగ్లాకు రానున్నారని, అక్కడ మాదిగల జీవనోపాధి కోసం చర్మపరిశ్రమ, తోళ్లపరిశ్రమ, ఫుట్‌పాత్‌పై చెప్పులు కుట్టుకునే వారి జీవన, ఆర్థిక పరిస్థితులపైనా చర్చిస్తారన్నారు. నియోజకవర్గంలోని మాదిగలకు సమస్యలు ఉంటే వినతి పత్రాల రూపంలో చైర్మన్‌కు తెలుపవచ్చన్నారు. ఈ సమావేశంలో కేశవయ్య, ఎం.పిచ్చయ్య, శిఖామణి, ఓ.ఎస్.వి.ప్రసాద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్‌తో జీవనం.. నిద్రకు దూరం

బద్వేల్‌కు చెందిన కేదార్‌రెడ్డి బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. రోజూ పది గంటలపాటు కంప్యూటర్ పై పనిచేయడమేగాక.. తిరిగి వచ్చి ఇంట్లో సెల్‌ఫోన్ చూస్తూ సేద తీరుతున్నాడు. ఎంతకీ నిద్ర రాకపోతే మళ్లీ సెల్‌ఫోన్ ఓపెన్ చేస్తాడు. దీంతో ఆయనకు సరిగా ఆకలి లేక తలనొప్పి, ఒత్తిడి కలిసి ఆరోగ్యాన్ని పాడుచేశాయి. వైద్యులు దినచర్య మార్చుకోవడాలని చెప్పడంతో సెల్‌ఫోన్‌కూ దూరంగా ఉంటూ వ్యాయామం చేయడం ప్రారంభించాడు. దీంతో సమస్యలు కుదుటపడ్డాయి.

- అర్ధరాత్రి వరకూ సెల్ ఫోన్లతోనే గడుపుతున్న జనం
- పిల్లలు, పెద్దల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- రాత్రి ఎనిమిది గంటలు నిద్రపోవడం మేలంటున్న వైద్యులు


సెల్‌ఫోన్ చూసుకుంటున్న మహిళ

బద్వేలు: పట్టణంలో 2011 ఎక్కల ప్రకారం 1.5 లక్షల మంది నివాసముంటున్నారు. వీరిలో 70 శాతం వరకూ నిత్యం సెల్‌ఫోన్ వాడుతున్నారు. వారిలో విద్యార్థులు, యువకులు ఎక్కువగా ఉన్నారు. ఒకే ఇంట్లో ఎంతమంది ఉన్నా.. వారందరికీ స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. గతంలో పొద్దుగూకితే చాలు పల్లెలన్నీ పడకేసేవి. ఏడెనిమిది గంటలకే జనం మంచాలపై చేరి కునుకుతీసేవారు. ఇపుడు రాత్రి పది దాటినా ఇళ్లల్లో లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. బద్వేల్ పట్టణంలోనూ అర్ధరాత్రి దాటాక కూడా ఎక్కడ చూసినా నిద్రలోకి వెళ్లడం లేదు. టీవీలో నాటికలు, ఓటీటీలో సినిమాలు, ఫోన్‌లో మాట్లాడు కోవడాలే కనిపిస్తున్నాయి. దీంతో పల్లె.. పట్టణం తేడాలేకుండా అంతా నిద్ర మరచి, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సరదాగా పొద్దుపోయేందుకు ప్రారంభమైన సెల్‌ఫోన్ వాడకం క్రమక్రమంగా ఒక వ్యసనంగా మారిపోయింది. దీంతో నిద్ర కరవైంది. నిద్ర మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్య ఔషధం. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా.. నిద్రకు సమయాన్ని కేటాయించడం చాలా అవసరం. మనస్సులో ఎలాంటి ఆలోచనలు రాకుండా చూసుకోవడం మంచిదంటున్నారు వైద్యులు.

సమస్య మొదలైంది ఎక్కడ?

అన్ని వయస్సుల వారిని వేధిస్తున్న సమస్య నిద్ర. చదువుకొనే విద్యార్థుల నుంచి ఉద్యోగం చేసే వారి వరకూ.. ఇంటి వద్ద ఉండే వృద్ధులను ఈ సమస్య వెంటాడుతోంది. సెల్‌ఫోన్ వ్యసనంగా మారడంతో రేడియేషన్ విడుదలై మానవ శరీరాన్ని అతలాకుతలం చేస్తోంది. నిద్రలేమితో తలనొప్పి, అలసట, ఏకాగ్రత కోల్పోవడంతోపాటు ఎక్కువ మందిలో సంతాన సమస్య తీవ్రంగా ఉంది. ఓ సంస్థ ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో గుండె బలహీన పడడం, నరాల పటుత్వం కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఆకలి కోల్పోవడం, అధిక బరువు సమస్యలు వస్తున్నట్లు వెల్లడైంది. నిద్రలేమి నుంచి బయటపడితే ఆరోగ్యానికి అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

అలవాట్లు మార్చుకోవాలి



ఉద్యోగంలో పని ఒత్తిడిని అధిగమించేందుకు సెల్‌ఫోన్ వాడుతుంటాం. ఇంట్లో పిల్లలు వీడియోలు, ఆటలకు అలవాటు పడి ఎక్కువ సమయం ఫోన్, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో శరీరంలో మార్పులు సంభవించాయి. వాటి వాడకం తగ్గిస్తే అనారోగ్య సమస్యలు తగ్గుతాయి.

– కె.సి.రామారావు, ఉపాధ్యాయుడు, కలసపాడు

అతిగా వాడితే అనర్థం



ఫోన్ అతిగా వాడటంతో అన్నీ అనర్థాలే జరుగుతాయి. రోగం వచ్చినప్పుడు డాక్టర్ ఇచ్చిన మందు ఒక మోతాదులో వాడుకోమంటాడు. మోతాదుకు మించి వాడితే అపాయమే..అలాగే ఫోన్ అవసరం మేరకు వాడితే మంచిదే..లేదంటే ఎంతవరకేనా ఆపాయం జరుగవచ్చు..పిల్లల చేతికి అసలు ఫోన్ ఇవ్వకూడదు.

– ఎం.రామారెడ్డి, ఉపాధ్యాయులు, కమలకూరు

రోజూ ఎనిమిది గంటలు నిద్రపోవాలి



రాత్రి 9 గంటల తరువాత ఫోన్ జోలికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. రోజూ ఖచ్చితంగా ఎనిమిది గంటలు నిద్రపోవాలి. లేనిపక్షంలో అరుగుదల తగ్గి మలబద్ధకం వస్తుంది. ఏకాగ్రత దెబ్బతినడం, నరాల బలహీనత మొదలవడం, కిడ్నీలపై భారం పడి బీపీ, షుగర్ వ్యాధులు వచ్చి ఆరోగ్యాన్ని పాడు చేయడం జరుగుతుంది. వీలైనంత వరకు రాత్రిళ్లు టీవీ, సెలఫోన్ చూడకపోవడం మంచిది.

– డాక్టర్ సీహెచ్.హాసిని, ఎంబీబీఎస్, ఎంఎస్, హైదరాబాద్

శక్తి యాప్.. మహిళలకు శ్రీరామరక్ష


కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, తదితరులు

మైదుకూరు: శక్తి యాప్.. మహిళలకు శ్రీరామరక్ష అని వైస్ ప్రిన్సిపల్ సుకళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్ అన్నారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శక్తి యాప్ ఇన్‌స్టలేషన్, డెమో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సుభాన్ సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం శక్తి యాప్ ప్రవేశపెట్టిందన్నారు. ఆపద సమయంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్బన్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు జీవీ లక్ష్మయ్య, మురళి మాట్లాడుతూ మొబైల్ వినియోగిస్తున్న ప్రతి మహిళ శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఏదైనా ఆపద సంభవించినప్పుడు వినియోగించుకోవాలన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్ ద్వారా అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, మాట్లాడడం తమ ప్రాణాలకే ముప్పు తెచ్చే ప్రమాదం ఉందన్నారు. అధ్యాపకురాలు అనురాధ మాట్లాడుతూ చెడు స్నేహాలకు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. యువతులు చదువుపై శ్రద్ధ వహించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, తులసి, తేజస్విని, రామేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రాధారామ్, చెన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలపై పల్లెల్లో ప్రచారం


అవగాహన కల్పిస్తున్న కొండయ్య, విశ్వం

మైదుకూరు: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశాలు పొంది ఉత్తమ భవిష్యత్తు పొందాలని ఉపాధ్యాయుడు కొండయ్య, సీఆర్పీ విశ్వం కోరారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై మంగళవారం వారు ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు, మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అనాథలు, బడి బయట ఉన్న వారు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన వారు కేజీబీవీలో చదివే అవకాశాన్ని పొందవచ్చునన్నారు. మైదుకూరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతికి 40, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్‌నకు 40 సీట్లు ఉన్నాయన్నారు. 7, 8, 9, 10, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


సరకులు పరిశీలిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్: రంజాన్ మాసం సందర్భంగా జమాయితే ఇస్లాం మాస్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 200 మంది పేద ముస్లింల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఫాతిమా మసీదు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్ మాట్లాడుతూ పేద ముస్లీంలు సంతోషంగా పండగ జరుపు కోవాలనే ఉద్దేశ్యంతో గత నాలుగేళ్లుగా బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జమాయితే ఇస్లాం మాస్క్ అసోసియేషన్ సెక్రటరీలు సరిటాల మౌలాలి, గౌస్‌బాషా(బాబ్జీ), వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, కౌన్సిలర్ హసన్, ముస్లీం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షఫి, మైనార్టీ నాయకులు షరీఫ్, అంజాద్, కరీముల్లా, హనీఫ్ పాల్గొన్నారు.

తువ్వపల్లెలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ


గ్రామ అవసరాలకు కేటాయించిన భూమి

బి.కోడూరు: స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ ఆక్రమణలు అధికమయ్యాయి. పట్టణ ప్రాంతాల్లోనేగాక గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములు, ఇనాంలు, గ్రామ కంఠాలను కూడా వదలడం లేదు. మండలంలోని తువ్వపల్లె గ్రామ సమీపాన గ్రామ అవసరాల కోసం 51 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల ఆ గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. తహసీల్దారుకు గ్రామస్తులంతా ఫిర్యాదు చేయగా తనకు తెలియదని, తాను విధుల్లో చేరక ముందే ఆన్‌లైన్‌లో నమోదై ఉందని చెప్పారన్నారు. అధికారులు చొరవచూపి ఆన్‌లైన్‌లో వివరాలు తొలగించాలని గ్రామస్తులు కోరారు.

బాలికలతో దరఖాస్తు చేయించండి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు అర్హులైన బాలికలచే దరఖాస్తు చేయించాలని ఎంఈఓ కాశయ్య, కేజీబీవీ ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరి కోరారు. పట్టణంలోని గిరినగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వారు మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు విద్యార్థినులను ఆహ్వానిస్తున్నామన్నారు. మార్చి 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. బడి మానేసిన పిల్లలు, బడి బయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు కేజీబీవీలో చేరేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్‌కు పరిగణిస్తామన్నారు. నరసింహులు, జనార్దన్, సునీల్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చక్రాయపేట: చక్రాయపేటలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గౌస్‌ప్యారి తెలిపారు. తమ పాఠశాలలో 6వ తరగతిలో 40, 7వ తరగతిలో 5, 9వ తరగతిలో 5, 10వ తరగతిలో 2, ఇంటర్మీడియట్ మొదటి బైపీసీ గ్రూపులో సంవత్సరం 40, ద్వితీయ సంవత్సరంలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన బాలికలు ఏప్రిల్ 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తాం


జైలు సిబ్బందికి సూచనలిస్తున్న బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్: సబ్ జైలులో అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ జైలును మంగళవారం ఆయన సందర్శించారు. జైలు పరిసరాలు, వసతి, వంట గది, మరుగుదొడ్ల పరిశీలించారు. అనంతరం రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్ జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యం వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీకేటీ స్థలాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం


ఇళ్ల క్రమబద్ధీకరణపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్: అభ్యంతరం లేని ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్, 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పూర్తి స్థాయి ఇళ్లకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారని తెలిపారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండరాదని, నాలుగు చక్రాల వాహనం ఉండరాదని తెలిపారు. చెరువు పోరంబోకు, లేఅవుట్ స్థలాలలో నిర్మించిన ఇళ్లకు క్రమబద్ధీకరణ అవకాశం లేదని, ఖాళీ స్థలాలు, తాత్కాలిక ఇళ్ళు నిర్మించిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, సెక్రటరీలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

గోపవరం: సోమశిల ప్రాజెక్టు వెనుక జలాల కింద ముంపున కు గురైన సూరేపల్లె ముంపు బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని సూరేపల్లెలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 2008లో కమ్యూనికేషన్ కటాఫ్ కింద సూరేపల్లె దళిత వాడకు అప్పటి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వడం జరిగిందని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు జీవో విడుదల చేశారని స్థానికులు ఆర్డీవోకు తెలిపారు. సోమశిల ప్రాజెక్టులోకి నీరు వచ్చినప్పుడల్లా దళితవాడలోకి వెనుక జలాలు వస్తున్నాయని, ఏటా తాము ఇబ్బంది పడుతున్నట్లు ఆర్డీఓకు మొరపెట్టుకున్నారు. ఇళ్ల స్థలాలు కేటాయిస్తే దళితవాడను విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సూరేపల్లె, వడ్డెపాలెం బాధితులు కూడా ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. సదస్సులో తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో పత్తి సాగుపై రైతుల దృష్టి


నీటిపారుదల కింద సాగైన పత్తి

వేముల : ఈ ఏడాది వేసవిలో పత్తి సాగుపై రైతులు దృష్టి సారించారు. పులివెందుల నియోజకవర్గంలో విస్తారంగా పత్తి సాగవుతోంది. మామూలుగా ఏప్రిల్ మొదటి వారంలో పత్తి సాగు చేసే రైతులు మార్చి నుంచే సాగుపై దృష్టి పెట్టారు. బోర్లు, బావుల కింద విస్తారంగా పత్తి పంట సాగు చేస్తున్నారు. డ్రిప్, నీటి పారుదల కింద సాగు చేశారు. ఇప్పటి నుంచి జూన్ వరకు భూములను బీళ్లుగా ఉంచలేక రైతులు పత్తి పంటను ఎంచుకుంటున్నారు. అయితే పత్తి సాగు చేశాక వేసవిలో నీటితడులు అందించడం రైతులకు భారంగా మారుతోంది.

10వేల ఎకరాల్లో సాగు

వేసవిలో పులివెందుల నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకుపైనే సాగవుతోంది. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా పత్తి సాగు చేస్తారు. ఎక్కువగా నాయక్, ఆర్మీ, సూపర్ బంటు, నందిని, తేజ తదితర రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి దిగుబడులు వచ్చేవరకు నీటితడులు ఇవ్వాల్సి ఉంటుంది. ముంగారు వర్షాలు రాకపోతే ఎక్కువ తడులు నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. పంట కాపునకు వచ్చే దశలో వర్షాలు పడితే పంట ఏపుగా పెరుగుతుందని వర్షాలు లేకపోతే పంట గిటకబారిపోతుందని రైతులు అంటున్నారు. వేసవిలో పంట మొలకెత్తాక ఉష్ణోగ్రతలకు పత్తి దెబ్బతినకుండా తట్టుకుంటుందనే సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు

పత్తి సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైనే సాగులో రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. పంట సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు అందుతాయి. దిగుబడులు ప్రారంభమైన 40 రోజులకు పూర్తిగా చేతికి వస్తాయి. పంట సాగు చేసిన నెల రోజులకే సాగులో కలుపు తీయడం, సాగు చేసిన 50 రోజుల నుంచే తెగుళ్ల నివారణ మందులు పిచికారి చేయడంతో పెట్టుబడులు అవుతున్నాయి. దిగుబడులు వచ్చే సమయానికి నాలుగైదు సార్లు పురుగు మందులను పిచికారి చేస్తున్నామని రైతులు అంటున్నారు. సాగులో పత్తి తీసేందుకు కూలీలు ఖర్చులు అదనంగా వస్తున్నాయని దీంతోనే పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అంటున్నారు.

దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతో

పత్తి సాగులో దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతోనే రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. గత ఏడాది ఎకరాకు 13 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ప్రతి ఏడాది నూతన పత్తి వంగడాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఎక్కువగా రైతులు కొత్త వంగడాలను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లోకి వచ్చిన మొదటి ఏడాది దిగుబడులు ఉంటాయనే దిశగా మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది కూడా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు ఉంటాయనే ఆశ రైతులలో ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే దిగుబడులు పెరిగి రైతులకు ఊరటనిస్తుంది.

మార్కెట్ ధరలు ఉండాలి

పత్తికి మార్కెట్‌లో ధరలు ఉంటే ఆదాయం ఉంటుంది. గత ఏడాది క్వింటా రూ.7,300ల నుంచి రూ.8200ల వరకు ధర పలికింది. సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతుకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్కెట్ ధరలు ఉంటాయనే ఆశతో రైతులు ఉన్నారు. నియోజకవర్గంలోని వేముల మండలంలోనే 5వేల ఎకరాలకుపైనే పత్తి సాగవుతుంది. ఈ ప్రాంతం పత్తి సాగుకు అనుకూలం కావడంతో వేసవి పత్తిని ఎంచుకుంటున్నారు.

పత్తి సాగు రైతులకు ఊరట

వేసవి సీజన్‌లో పత్తి సాగు రైతులకు ఊరటే. సాగులో దిగుబడులు ఉండి ధరలు ఉంటాయనే ఆశతో పత్తి సాగు ఎంచుకుంటున్నారు. ఈ ఏడాది మండలంలో పత్తి సాగు పెరిగే అవకాశం ఉంది. ఎక్కువ మంది రైతులు పత్తి సాగుపైనే దృష్టి పెట్టి సాగు చేస్తున్నారు. పత్తి సాగులో సకాలంలో తెగుళ్లను నివారిస్తే దిగుబడులు ఉంటాయి.

– చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్: లక్ష్యాలను అధిగమించడంలో నిర్లక్ష్యం తగదని జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గోపవరం పంచాయతీలోని ఒకటో సచివాలయాన్ని మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ గర్భవతిగా నమోదైనప్పటి నుంచి సుఖ ప్రసవం జరిగే వరకు అన్ని రకాల ఆరోగ్య సేవలు అందిస్తూ జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. గర్భవతులకు అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత లేకుండా చూడాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామనూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డీపీఎం నారాయణ, జాకబ్, శాంతిలత, కృష్ణమ్మ, వరప్రసాద్, గంగాధర్, గౌతమి, మెర్సీ, గంగతులసి పాల్గొన్నారు.


జగన్‌ను రాజకీయాలకు దూరం చేయడం పగటి కల

– రైద్యం వెంకటసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

చాపాడు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయాలకు దూరం చేయాలని, కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్.అవినాష్ రెడ్డిని ఓడించాలని టీడీపీ ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, ఆర్.మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డి పగటి కలలు కంటున్నారని ఏపీఎస్సార్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలన.. జనరంజకంగా సాగిందని, పార్టీల ప్రస్తావన లేకుండా అందరికీ లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ కార్యక్రమాల్ని పేదలకు అందించిన ఘనత ఒక్క జగన్‌కే సాధ్యమని ఆయన కితాబిచ్చారు. దాచుకోవడం – దోచుకోవడం టీడీపీకి పేటెంట్ హక్కు అని విమర్శించారు. తాము నీతివంతమైన రాజకీయాలు చేస్తామని చెబుతున్న టీడీపీ నేతలు తగిన బలం లేకున్నా ఎందుకు పోటీ చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి విధేయుడన్నారు.

టీటీడీ ధార్మిక కార్యక్రమాలు


ప్రసంగిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

చాపాడు: మండలంలోని సీతారామాపురం గ్రామంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కడప టీడీపీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ గోపీబాబు తెలిపారు. 26, 27వ తేదీలలో ధార్మిక ఉపన్యాసాలు, 28న కుంకుమపూజ, రోజూ భజనలు ఉంటాయన్నారు. మంగళవారం రామాయణం అంశంపై ప్రచార కర్త చాపాటి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. జగతికి ఆదర్శం, సామాజిక అభ్యున్నతికి ఉపకరించే గ్రంథం రామాయణం అన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఈనెల 16వ తేదీకి వాయిదా వేయడం జరిగిందన్నారు.